క్లుప్తంగా

ఫిబ్రవరిలో అంబేడ్కర్ యూనివర్సిటీ పరీక్షలు

బల్మూర్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం డిగ్రీ రెండో సంవత్సరం మూడో సెమిస్టర్ ఫిబ్రవరి 16వ తేదీ నుంచి నిర్వహిస్తున్నట్లు లెర్నింగ్ సపోర్టు సెంటర్ కొండనాగుల(143) కోఆర్డినేటర్ పరంగి రవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 31 వరకు ట్యూషన్ ఫీజు, జనవరి 17వ తేదీ వరకు పరీక్షల ఫీజును ఆన్‌లైన్ ద్వారా విశ్వవిద్యాలయం పోర్టల్‌లో నమోదు చేసుకొని చెల్లించాలని పేర్కొన్నారు. వివరాలకు సెల్: 7382929743 ను సంప్రదించాలని కోరారు.

దళిత, బహుజనుల ఆత్మగౌరవం కాపాడాలి

మన్ననూర్: కాంగ్రెస్ ప్రభుత్వం దళిత, బహుజనుల ఆత్మగౌరవం కాపాడాలని ప్రజాకళా మండలి రాష్ట్ర కమిటీ సభ్యుడు జక్క గోపాల్ కోరారు. బుధవారం పార్టీ నాయకులతో కలిసి అంబేద్కర్ గ్రంథాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 25 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ఉన్న ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణకు మంత్రి పదవి ఇవ్వాలని కోరారు. సమావేశంలో సింగిల్‌విండో మాజీ చైర్మన్ లక్ష్మణ్, నాయకులు నాసరయ్య, రాంకోటి, దివాకర్, బాలకిష్టయ్య పాల్గొన్నారు.

పింఛన్లు ఇవ్వకుంటే ఆందోళన చేస్తాం

నాగర్‌కర్నూల్‌రూరల్: సకాలంలో దివ్యాంగులకు పింఛన్లు ఇవ్వకుంటే ఆందోళన చేస్తామని ఆ సంఘం జిల్లా నాయకుడు వెంకటయ్య బుధవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. జిల్లాలో నవంబర్, డిసెంబర్ నెలకు సంబంధించి పింఛన్ ఇప్పటివరకు మంజూరు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి నెల సమయానికి పింఛన్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు.

రేపు పంచాయతీ భవనం ప్రారంభం

లింగాల: మండలంలోని జీల్గుపల్లిలో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని ఈ నెల 29న ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ ప్రారంభిస్తారని సర్పంచ్ కొత్త ప్రసన్న బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. భవన నిర్మాణానికి ఎస్‌డీఎఫ్, ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకాల ద్వారా రూ.20 లక్షలు మంజూరు అయ్యాయని పేర్కొన్నారు.

నేడు ఎమ్మెల్యే రాక

చారకొండ: మండల కేంద్రంలో ఏర్పాటు చేయనున్న గ్రామసభలో అచ్చంపేట్ ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ ప్రజల నుంచి ప్రజాపాలన దరఖాస్తులు స్వీకరిస్తారని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బాల్‌రాం గౌడ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పార్టీ నాయకులు హాజరు కావాలని కోరారు.

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ



కందనూలు: జిల్లా కేంద్రంలోని సాయిగార్డెన్‌లో పలు మండలాలకు చెందిన 213 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను బుధవారం ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదింటి ఆడబిడ్డలకు ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

అంబారామలింగేశ్వర స్వామికి పూజలు



వెల్దండ: మండలంలోని గుండాల అంబారామలింగేశ్వర స్వామికి బుధవారం ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మార్గశిర మాస ఆర్ద్ర నక్షత్రం పురస్కరించుకొని స్వామివారికి ఆర్ద్రోత్సవం, ఏకాదశ రుద్రాభిషేకం, విశేషాలంకరణ తదితర పూజలు చేశారు. సప్తగుండాలు ఉండడంతో కోనేరులో పుణ్యస్నానాలను ఆచరించి స్వామివారిని దర్శించుకున్నారు.

కాంగ్రెస్‌తోనే పేదలకు మేలు

వెల్దండ: కాంగ్రెస్‌తోనే పేదలకు మేలు చేకూరుతుందని సర్పంచ్ భూపతిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 28 నుంచి ప్రజాపాలనలో భాగంగా గ్రామసభలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వెల్దండలో నిర్వహించే గ్రామసభకు ముఖ్య అతిథులుగా కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జయప్రకాష్, రాజుయాదవ్ ఉన్నారు.

నేటి నుంచి గ్రామసభలు

- వచ్చేనెల 6వ తేదీ వరకు ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ
- గ్రామాల్లో ఏర్పాట్లు పూర్తి



అచ్చంపేట ఒకటో వార్డులో ఏర్పాట్లను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ నర్సింహగౌడ్

నాగర్‌కర్నూల్‌రూరల్: ఆరు గ్యారంటీ పథకాలకు దరఖాస్తు చేసుకునే లబ్ధిదారుల ఎంపిక కోసం ఈ నెల 28 నుంచి జనవరి 6వ తేదీ వరకు గ్రామ సభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కోటేశ్వర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

కొల్లాపూర్: పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజాపాలనపై అధికారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సుకు డీఎల్‌పీఓ వెంకటేశ్వర్లు, డీఏఓ హిమబిందు హాజరయ్యారు. మున్సిపాలిటీ, గ్రామాల్లో దరఖాస్తుల స్వీకరణ కోసం బృందాలను ఏర్పాటు చేశామన్నారు.

ఉప్పునుంతల: ఈనెల 28న ఉప్పునుంతల, వెల్టూరు, తాడూరు గ్రామాల్లో, 29న కాంసానిపల్లి, కాంసానిపల్లి తండా, జప్తీ సదగోడు, తిర్మలాపూర్‌లో, 30న గువ్వలోనిపల్లి, ఈరట్వానిపల్లి, ఫిరట్వానిపల్లి, అయ్యవారిపల్లి గ్రామాల్లో, జనవరి 2న పెనిమిళ్ల, సీబీ తండా, మర్రిపల్లి, ఉప్పరిపల్లిలో, జనవరి 3న మామిళ్లపల్లి, దాసర్లపల్లి, పెద్దాపూర్, మొల్గరలో ప్రజాపాలనకు సంబంధించిన దరఖాస్తులు స్వీకరిస్తామని ఎంపీడీఓ లక్ష్మణ్‌రావు పేర్కొన్నారు. అదేవిధంగా 4న కొరటికల్, తిప్పాపూర్ గ్రామాల్లో, 5 దేవదారికుంట తండా, లత్తీపూర్, సూర్యతండా గ్రామాల్లో, 6న లక్ష్మాపూర్, రాయిచెడ్, పూర్యానాయక్ తండాలో గ్రామసభలు నిర్వహిస్తామని తెలిపారు.

లింగాల: ఈ నెల 28న అంబట్‌పల్లి, 29న లింగాల, 30న రాయవరం, క్యాంపురాయవరం, మగ్దూంపూర్, కొత్తచెర్వుతండా, వల్లబాపూర్, జనవరి 2న అప్పాయపల్లి, ఎంసీ తండా, కోమటికుంట, కొత్తకుంటపల్లి, రాంపూర్, 3న పద్మన్నపల్లి, సూరాపూర్, దత్తారం, 4న అప్పాపూర్‌పెంట, చెన్నంపల్లి, శ్రీరంగాపూర్, జీల్గుపల్లి, బాకారం, శాయిన్‌పేట గ్రామ పంచాయతీలలో గ్రామ సభలను ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ గీతాంజలి తెలిపారు.

చారకొండ: మండలంలో మూడు బృందాలను ఏర్పాటు చేసి 17 గ్రామ పంచాయతీలో గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ జయసుధ ఓ ప్రకటనలో తెలిపారు.

పెంట్లవెల్లి: ఈ నెల 28న పెంట్లవెల్లి, జటప్రోలు, 29న కొండూరు, గోప్లాపూర్, 30న మల్లేశ్వరం, మంచాలకట్ట, 2న మాధవస్వామినగర్, యంగంపల్లి తండా, 3న సింగవరం, తడకల తండా గ్రామాల్లో గ్రామసభలు నిర్వహిస్తునట్లు ఎంపీడీఓ రామయ్య తెలిపారు.

కోడేరు: ఈ నెల 28న కోడేరు, ఎత్తం, 29న రేకులపల్లి, రాజాపూర్, 30న నర్సాయిపల్లి, సింగాయిపల్లి, తీగలపల్లి, పస్పుల, 2న కొండ్రావుపల్లి, నాగులపల్లి, 3న మాచుపల్లి, ముత్తిరెడ్డిపల్లి, మైలారం, జనుంపల్లి, 4న తుర్కదిన్నె, బావాయిపల్లి, 5న గుండ్యవాల్యానాయక్ తండా, నాగులపల్లి తండా, నార్యనాయక్ తండా, 6న బాడిగదిన్నె తండా, ఎర్రన్నబావి తండా, తుర్కదిన్నెలో దరఖాస్తులు స్వీకరిస్తామని ఎంపీడీఓ బాలచంద్ర సృజన, ఎంపీఓ శ్రావణ్‌కుమార్ తెలిపారు.

తెలకపల్లి: మండల కేంద్రంతో పాటు పెద్దపల్లి గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని ఎంపీడీఓ భాస్కర్ పేర్కొన్నారు.

తాడూరు: నేటి నుంచి వారం రోజుల పాటు గ్రామ సభలు నిర్వహించి దరఖాస్తులను స్వీకరిస్తామని ఎంపీడీఓ పేర్కొన్నారు.

ఏర్పాట్లు పరిశీలన

అచ్చంపేట రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న ప్రజాపాలనకు అన్ని ఏర్పాట్లు చేశామని మున్సిపల్ చైర్మన్ నర్సింహగౌడ్ తెలిపారు. బుధవారం ఆయన కౌన్సిలర్ గౌరీశంకర్‌తో కలిసి మున్సిపల్ ఏర్పాట్లను పరిశీలించారు. వార్డులలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కౌంటర్ల వద్ద దరఖాస్తులను స్వీకరిస్తారని తెలిపారు. రేషన్‌కార్డులు, వంటగ్యాస్, పింఛన్లు, మహాలక్ష్మి, ఇందిరమ్మ ఇల్లు, గృహజ్యోతి, చేయూత వంటి పథకాలకు సంబంధించి ఒకే దరఖాస్తు ఉంటుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ తబ్రేస్‌ఖాన్, ప్రవీణ్‌కుమార్, బాబన్న తదితరులు పాల్గొన్నారు.

అధికారులకు అవగాహన

కల్వకుర్తి టౌన్: మున్సిపల్ కార్యాలయంలో వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లు, ఇతర సిబ్బందితో దరఖాస్తుల స్వీకరణలో పాటించాల్సిన అంశాలపై బుధవారం మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ అవగాహన కల్పించారు. మున్సిపల్‌లోని 22 వార్డులకు గాను 22 మంది అధికారులు, ఇద్దరు సహాయకులను నియమించినట్లు కమిషనర్ తెలిపారు. నేడు ప్రజాపాలనపై కౌన్సిల్ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు కమిషనర్ పేర్కొన్నారు.

పకడ్బందీగా నిర్వహించాలి



అవగాహన కల్పిస్తున్న శ్రీనివాసులు

అచ్చంపేట: ప్రజాపాలన కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని డివిజన పరిపాలన అధికారి శ్రీనివాసులు అన్నారు. బుధవారం ఆర్డీవో కార్యాలయంలో ప్రజాపాలన గ్రామ, వార్డు సభల నిర్వహణపై ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 28 నుంచి జనవరి 6తేదీ వరకు గ్రామపంచాయతీ, మున్సిపాలిటీలోని వార్డుల్లో సభలు నిర్వహించాలన్నారు. ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి రశీదులు అందించాలన్నారు. ప్రతి గ్రామంలో ఒకరోజు ముందుగానే టామ్‌టామ్ వేయించి, ప్రజలందరికీ విస్తృత అవగాహన కల్పించాలన్నారు. గ్రామసభలో టెంట్, తాగునీరు, ఇతర వసతులు కల్పించాలని, అంగన్‌వాడీ టీచర్, ఆశావర్కర్లు, ఇతరల చేత హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతి 100 కుటుంబాలకు ఒక కౌంటర్ ఏర్పాటు చేయాలని కోరారు. కౌంటర్ల వద్ద క్యూలైన్ పాటించేలా చర్యలు తీసుకోవాలని, అవసరమైతే బారికేడ్లు, పోలీసుల బందోబస్తు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎడ్ల నర్సింహ్మగౌడు, కౌన్సిలర్ గార్లపాటి శ్రీనివాసులు, జెడ్పీటీసీ రాంబాబు, ఎంపీపీ శ్రీనివాసులు, సీఎంరెడ్డి డీటీ రాములు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులను వేధిస్తే చర్యలు



నాగర్‌కర్నూల్ క్రైం: విద్యార్థినులను వేధిస్తే చర్యలు తీసుకుంటామని షీటీం ఇన్‌చార్జ్, ఏఎస్సై విజయలక్ష్మి హెచ్చరించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో షీ టీంబృందం ఆధ్వర్యంలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆకతాయిలు వేధిస్తే సెల్: 8712657676 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. లేదా 100 డయల్ చేయాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మాధవి, షీ టీం అధికారి వెంకటయ్య, కళాశాల అధ్యాపకులు రవి ప్రకాష్,వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.

టీవీ వితరణ



తెలకపల్లి: మండలంలోని అనంతసాగర్ అంగన్‌వాడీ కేంద్రానికి బుధవారం రాయిపాకుల ఎంపీటీసీ సభ్యుడు యాతం బాలయ్య రూ.16వేల సొంత ఖర్చుతో టీవీ వితరణ చేశారు. చిన్నారులకు వీడియోల రూపంలో విద్యనందించేందుకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మ, ఉమెన్ క్లబ్ సూపర్‌వైజర్ సునీత, అంగన్‌వాడీ టీచర్ సుజాత, మాజీ సర్పంచ్ భాస్కర్, సర్పంచ్ విష్ణు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలనతో పేదలకు న్యాయం

మన్ననూర్: ప్రజాపాలనతో పేదలకు న్యాయం చేకూరుతుందని అమ్రాబాద్ జెడ్పీటీసీ డాక్టర్ అనురాధ అన్నారు. బుధవారం స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆమె విలేకరులతో మాట్లాడారు. అర్హులైన ప్రతి ఒక్కరు కూడా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. గ్రామసభల అనంతరం కూడా నిరంతర ప్రక్రియలో భాగంగా అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించి సంక్షేమ పథకాలు అందజేస్తామన్నారు. పేదలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైస్ ఎంపీపీ ప్రణీత, సంబు శోభ, బాలమ్మ, సుజాత పాల్గొన్నారు.

రైతులందరికీ సభ్యత్వం అందజేస్తాం

కల్వకుర్తిరూరల్: కల్వకుర్తి, ఊర్కొండ మండలాల పరిధిలోని రైతులందరికీ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో సభ్యత్వం అందిస్తున్నట్లు పీఏసీఎస్ చైర్మన్ తలసాని జనార్దన్‌రెడ్డి అన్నారు. బుధవారం సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సభ్యత్వం కోసం రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్, మూడు పాస్‌పోర్ట్‌సైజ్ ఫొటోలు, రూ.350లు రుసుము, బ్యాంకులో అకౌంట్ కోసం రూ.500 లు చెల్లించాల్సి ఉంటుందన్నారు. అన్ని పత్రాలు జత చేసి నాగర్‌కర్నూల్ రోడ్డులోని పీఏసీఎస్ నూతన కార్యాలయంలో అందజేయాలన్నారు. జనవరి 1వ తేది నుంచి సభ్యత్వ నమోదు ప్రారంభిస్తున్నట్లు జనార్దన్‌రెడ్డి తెలిపారు.

వ్యక్తిపై కేసు నమోదు

వెల్దండ: మండలంలోని పెద్దాపూర్ గ్రామానికి చెందిన కాటిక మణికంఠ్‌పై అదే గ్రామానికి చెందిన కొప్పు ప్రవీణ్ కర్రతో దాడి చేశాడు. ఈ విషయమై బుధవారం మణికంఠ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు.

రుణాలు సకాలంలో చెల్లించాలి



అవగాహన కల్పిస్తున్న ఏపీడీ లక్ష్మీనారాయణ

తాడూరు: బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలను మహిళా సంఘం సభ్యులు సకాలంలో చెల్లించాలని ఏపీడీ లక్ష్మీనారాయణ అన్నారు. బుధవారం మండల సమాఖ్య కార్యాలయ ఆవరణలో నిర్వహించిన ఈసీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇందిరా క్రాంతి పథకం ద్వారా తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లిస్తే కొత్త సంఘాలకు రుణాలు ఇచ్చేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఐకేపీ సిబ్బంది గ్రామాలు సందర్శించి వందశాతం రుణాలు చెల్లింపులు అయ్యే విధంగా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. అనంతరం సమావేశానికి సంబంధించి వివిధ అంశాలపై తీర్మానాలు చేశారు. కార్యక్రమంలో డీపీఎం వెంకటేశ్, ఐబీ డీపీఎం శ్రీనివాస్, ఏపీఎం శేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం నాణ్యతగా అందించాలి



పాన్‌గల్: విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం నాణ్యతగా అందించాలని ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ అన్నారు. బుధవారం మండలంలోని అన్నారం ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించి విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు శాతం, విద్యార్థుల సామర్థ్యాలను, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెనూ ప్రకారం భోజనం అందించేలా ప్రతి నిత్యం పాఠశాల హెచ్‌ఎంలు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాధ, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

నర్సరీల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ



ఐతోల్‌లో నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ

తాడూరు: నర్సరీల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తామని ఎంపీడీఓ గంగమోహన్, ఎంపీఓ లక్ష్మణ్ నాయక్‌లు అన్నారు. బుధవారం మండల కేంద్రంతో పాటు ఐతోలు, సిర్సవాడ గ్రామాల్లో వారు నర్సరీలను పరిశీలించారు. ఈ సందర్భంగా మొక్కల పెంపకం, సారవంతమైన మట్టిపై నిర్వాహకులకు అవగాహన కల్పించారు. కవర్లలో మొక్కల అంచులకు వచ్చే పిచ్చి మొక్కలను ఎప్పటికప్పుడు తొలగించాలని సూచించారు. జూన్ నెల వరకు మొక్కలను నాటేందుకు సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటం



జెండా ఎగురవేస్తున్న వార్ల వెంకటయ్య

చారకొండ: దేశంలో పేదరిక నిర్మూలన కోసం, దేశ సమగ్రత, మతోన్మాదానికి వ్యతిరేకంగా 99 సంవత్సరాలుగా ప్రజల సమస్యలపై సీపీఐ పోరాటం చేస్తుందని సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యులు వార్ల వెంకటయ్య అన్నారు. బుధవారం మండల కేంద్రంలో పార్టీ ఆధ్వర్యంలో వ్యవస్థాపక దినోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతామన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు డాక్టర్ శ్రీనివాసులు, వెంకటేష్, సీనియర్ నాయకులు మద్ది నారాయణ రెడ్డి, గడ్డ శ్రీనివాసులు, మెగిళ్ల శ్రీను అశోక్, వెంకటయ్య, తదితరులు ఉన్నారు.

విద్యుత్‌షాక్‌తో దుప్పి మృతి

పెద్దకొత్తపల్లి: మండలంలోని చంద్రబండ తండాకు చెందిన రైతు రాత్లావత్ లాలు వ్యవసాయ పొలం వద్ద విద్యుదాఘాతంతో దుప్పి మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఫారెస్టు రేంజర్ శరత్‌చంద్రారెడ్డి వివరాల ప్రకారం వేరుశనగ పంటకు రైతు విద్యుత్‌కంచెను ఏర్పాటు చేశారు. మూడు రోజుల కిందట దుప్పి విద్యుత్ కంచెకు తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. దీంతో రైతు దుప్పి కళేబరాన్ని అక్కడే పాతిపెట్టాడు. ఈ విషయం ఫారెస్ట్ అధికారులకు తెలియడంతో బుధవారం తండాకు చేరుకొని ఘటన స్థలాన్ని పరిశీలించి దుప్పి కళేబరాన్ని బయటకు తీశారు. ఈ ఘటనపై రైతు లాలుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఫారెస్టు రేంజర్ తెలిపారు.

బడిబయటి పిల్లలపై సర్వే

కోడేరు: బడి బయట ఉన్న పిల్లలను తల్లిదండ్రులు బడిలో చేర్పించాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులు నర్సింహ్మా, సాయికుమార్ అన్నారు. బుధవారం మండలంలోని నార్యానాయక్ తండాలో బడిబయటి పిల్లలపై సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లలను పనికి పంపించొద్దని పాఠశాలకు పంపాలన్నారు. బడి బయటి పిల్లలను ముగ్గురిని గుర్తించి పాఠశాలలో చేర్పించారు.

బహిరంగ ప్రదేశాలల్లో మద్యం తాగితే చర్యలు

పాన్‌గల్: బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగి ఇతరులకు ఇబ్బందులు కలిగిస్తే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ వేణు హెచ్చరించారు. బుధవారం మండల కేంద్రంలో మద్యం తాగి వాహనాలు నడిపితే ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఉందని యువతకు అవగాహన కల్పించారు. రోడ్డు నియమ నిబంధనలు పాటించాలన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పక ధరించాలన్నారు.

సీఎంను కలిసిన ఎమ్మెల్యే



కల్వకుర్తి: హైదరాబాద్‌లోని సచివాలయంతో సీఎం రేవంత్ రెడ్డిని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి బుధవారం జెడ్పీ వైస్‌చైర్మన్ బాలాజీ సింగ్‌తో మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గ అభివృద్ధి సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లారు. సానుకూలంగా స్పందించినట్లుగా ఎమ్మెల్యే తెలిపారు.

దాతల సహకారం మరవలేం




తెలకపల్లి: విద్యార్థులను సహకారం మరవలేమని సీఎల్‌ఆర్ విద్యాసంస్థల కరస్పాండెంట్ రాజమహేందర్‌రెడ్డి, ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాలస్వామి అన్నారు. బుధవారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలతో పాటు గౌరెడ్డిపల్లి ఉన్నత పాఠశాలలో ఉన్న విద్యార్థులకు రెండు నెలలకు సంబంధించిన రూ.32200 లు విద్యార్థులకు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మండలంలోని దాసుపల్లి గ్రామానికి చెందిన చీమర్ల దామోదర్ రెడ్డి కొన్ని సంవత్సరాలుగా 8,9,10 తరగతులు చదువుతున్న మెరిట్ విద్యార్థులకు ప్రోత్సాహకంగా ప్రతి నెలా ప్రోత్సాహక నగదును అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో రాజమహేందర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు బాలస్వామి, సీఎల్‌ఆర్ విద్యాసంస్థల ప్రిన్సిపాల్స్ సందీప్‌రావు, ప్రకాశ్ రెడ్డి, అధ్యాపకులు బాబయ్య, ఉపాధ్యాయులు కృష్ణయ్య, బాలస్వామి, తేజ పాల్గొన్నారు.

ఐకమత్యంతో ముందుకు సాగుదాం



లింగాల: ఐకమత్యంతో ముందుకు సాగుదామని బీసీ ఐక్యవేదిక సమావేశంలో నాయకులు తీర్మానించారు. బుధవారం మండల కేంద్రంలో బీసీ ఐక్య వేదిక ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాబోవు కాలంలో ఎలా ముందుకు వెళ్లాలి, బీసీలో అన్ని ఉప కులాల వారిని ఒకే తాటిపై తీసుకురావడం, స్థానిక సంస్థ ఎన్నికల్లో బీసీలకు అవకాశం వస్తే ఎలాంటి నిర్ణయాలు తీసుకోవాలనే అంశాలపై చర్చించారు. త్వరలో మండలంలోని అన్ని గ్రామాలలో బీసీ ఉప కులాలతో గ్రామ కమిటీలను ఏర్పాటు తర్వాత బీసీ ఐక్యవేదిక మండల కమిటీని ఏర్పాటు చేసుకోవాలని ఏకగ్రీవంగా ఆమోదించారు. సమావేశంలో పలువురు బీసీ ముఖ్యనాయకులు పాల్గొన్నారు.

కమ్మేసిన మంచు



తాడూరులో కమ్మేసిన పొగ మంచు

తాడూరు: నాలుగైదు రోజుల నుంచి ఉమ్మడి జిల్లాలో చలి తీవ్రత అధికంగా ఉంది. గ్రామాల్లో మంచు విపరీతంగా కురుస్తోంది. రోడ్లను మంచు కమ్మేయడంతో వాహనదారులు లైట్లు వేసుకొని నెమ్మదిగా ప్రయాణించారు. మండల కేంద్రంలో బుధవారం ఉదయం 9 గంటలు తర్వాత సూర్యుడు కనిపించాడు. చలితీవ్రతకు వృద్ధులు, చిన్నారులు ఇబ్బందులు పడ్డారు. కొందరు ప్రయాణాలను వాయిదా వేసుకున్నారు.

ప్రజలకు అవగాహన కల్పించాలి

మన్ననూర్: రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఓయూ విద్యార్థి, ఎన్‌ఎస్‌యూఐ జిల్లా ప్రధాన కార్యదర్శి యశ్వంత్ కోరారు. బుధవారం మన్ననూర్‌లోని అంబేద్కర్ కూడలిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రజలు దరఖాస్తు ఫారాలు ఎక్కడ అందుబాటులో ఉంటాయో తెలియక ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందన్నారు. ఎన్‌ఎస్‌యూఐ నాయకులు, కార్యకర్తలు లబ్ధిదారులకు సహాయకారిగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌యూఐ నాయకులు జగన్, వరుణ్, బాల్‌నారీ, చిన్న పాల్గొన్నారు.